ప్రజాశక్తి
శుక్రవారం 5 ఏప్రిల్ 2024
5
అల్లూరి సీతారామరాజు

బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-పాడేరు :బాల సదన్‌లో ఆశ్రయం పొందుతున్న బాలికలందరూ చదువులో బాగా రాణించి ఉత్తమ స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆకాంక్షించారు. గురువారం స్థానిక తలారిసింగి దరి బాల సదన్ సందర్శించిన కలెక్టర్ బాలికలతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా బాలికలకు పలు ప్రశ్నలు వేసి సమాదాలు రాబట్టారు. వారితో ఆటలు ఆడించి, పాటలు పాడించి వారితో ఆత్మీయంగా గడిపి వారిలో నూతన ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని నింపారు. ఇటీవల బాల సదన్‌కు మంజూరైన రెండు వాషింగ్ మెషిన్లను, స్మార్ట్ టివి, ప్రిజ్‌లను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కంచారు.బాలికలందరికీ సామగ్రి కిట్లను కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి.పద్మావతి, ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

సామగ్రిని ఇస్తున్న కలెక్టర్ విజయసునీత

గెలిపిస్తే చట్ట సభల్లో గళం వినిపిస్తాం

- గిరిజన సమస్యలపై సిపిఎం నిత్యం పోరాటం
- అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు
- మొర్రిగూడలో ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడుతున్న సిపిఎం అరకు పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను భారీ మెజార్టీతో అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు పిలుపునిచ్చారు.మండలంలోని గసభ పంచాయితీ మొర్రిగూడలో ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత, మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, సిపిఎం ఎప్పుడూ గిరిజన సమస్యల కోసం నిత్యం పోరాడుతుందన్నారు. చట్టసభల్లో గిరిజనుల పక్షాన గొంతెత్తే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ భూములను దారాదత్తం చేసి ఏజెన్సీ గిరిజన ప్రాంతాలలో హైడ్రో పవర్ ప్లాంట్ ప్రాజెక్టులను పెట్టడానికి కుటిల ప్రయత్నాలు సాగిస్తున్నాయని తెలిపారు. సిపిఎం గిరిజనుల పక్షాన పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుంకరమెట్ట పంచాయతీ సిపిఎం సర్పంచ్ చిన్నారావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు, నాయకులు టి సూర్యనారాయణ, పి సత్యనారాయణ, వార్డు సభ్యులు దొరబాబు, రాజ్ కుమార్, నాయకులు పి భాస్కరరావు, వి శివ, నారాజి సురేష్ బాబు, హరీష్, దేవా, అధిక సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సభకు తరలివచ్చిన గిరిజనులు

ర్యాలీ చేపడుతున్న గంగరాజు, ఉమామహేశ్వరరావు, నాయకులు, గిరిజనులు

మారేడుమిల్లి పిహెచ్‌సిలో తనిఖీ చేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

పిహెచ్‌సిల్లో మెరుగైన వైద్య సేవలు

వైద్యాధికారులకు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని బోదులూరు, మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పిహెచ్‌సిల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మలేరియా జ్వరాలు ప్రబలకుండా ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి మలేరియా ఫీవర్ల సర్వే చేయాలని, మలేరియా దోమలు నివారణ కొరకు మలాథియన్ స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. మలేరియా రక్త నమోనాలకు సంబంధించిన కిట్లు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకోవాలని, ఎవరైనా జ్వరాలతో వచ్చిన రోగులను వెంటనే రక్త పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచితంగా మందులు అందజేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. ఈ రెండు పిహెచ్‌సిల పరిధిలో ఎంతమంది గర్భిణులు ఉన్నదీ, ఎంతమంది ప్రమాదకర గర్భిణులగా గుర్తించినదీ, ఎంతమంది బర్త్ వెయిటింగ్ హాల్లో ఉన్నదీ అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిల్లో వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మారేడుమిల్లి గ్రామంలో వైద్యాధికారుల కోసం నిర్మిస్తున్న వసతి గృహాలు, హెల్త్ బ్లాక్ యూనిట్ పనులను పిఒ పరిశీలించి, పనులు వేగవంతంగా చేసి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. పిఒ వెంట ఏడియంహెచ్‌ఓ జి.ప్రకాశం, వైద్యాధికారులు హరికృష్ణ, సంతోష్, రాణి శిరీష, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, చైతన్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ప్రదీప్, భాను తదితరులున్నారు.

వైద్య బృందం పర్యటన

చింతలవీధి ఉప కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని చింతలవీధి ఆరోగ్య ఉపకేంద్రాన్ని జాతీయ క్వాలిటీ ఎస్యూరెన్స్ హెల్త్ టీం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు, వైద్యులు శ్రీధర్ సుబ్రహ్మణ్యం, సంతోష్ బాబులు ఆరోగ్య ఉప కేంద్రం లో (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) ద్వారా సబ్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవా కార్యక్రమాలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఇంకా ఎటువంటి వైద్య ఆరోగ్య సేవలను ప్రజలకు సంపూర్ణంగా అందించవచ్చు? ఆరోగ్య సేవలు అందించడంలో ఎదురవుతున్న లోపాలను ఎలా సవరించుకోవాలి? వాటి పరిష్కార మార్గాలు సూచించారు. అనంతరం స్థానిక ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్స్‌తో మాట్లాడుతూ, మాతా శిశు ఆరోగ్య సేవలు, మలేరియా, డెంగ్యూ వ్యాధి తీవ్రత నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా వర్కర్స్‌తో మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ఎటువంటి సేవలు అందిస్తున్నారని, ప్రజలకు ఆ సేవలు ఎలా అందుతున్నాయి ? ప్రజలు సంతృప్తిగా ఉన్నారా లేరా ? అని ఆశ కార్యకర్తలను ప్రశ్నించారు.చిన్న చిన్న పొరపాట్లను సవరించుకొని క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సేవలను మెరుగు పరుచుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రజానీకానికి మంచి ఆరోగ్య సేవలు అందించాలని బృందం సభ్యులు సూచించారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆరోగ్య ఉప కేంద్రానికి ప్రత్యేకంగా అభివృద్ధి నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని బృందం సభ్యులు తెలిపారు. బృందం వెంట మినుములూరు వైద్యాధికారి సాయిశ్రీ, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఏఎన్ఎం కృష్ణవేణి, సంధ్య, సుశీల, రాజులమ్మ, ఆశావర్కర్లు, అంగన్వాడీ ఉన్నారు.

వైద్యులు, సిబ్బందితో బృందం సభ్యులు

పింఛన్ల కోసం అవస్థలు

సచివాలయాలకు కాలినడకన పింఛనుదారుల రాక

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మండలంలో గురువారం నుంచి ప్రారంభమైంది. పింఛన్లు పంపిణీ చేసే నగదును బ్యాంకుల నుంచి విత్ డ్రా చేయడానికి ఆలస్యం జరగడంతో బుధవారం ప్రారంభించాల్సిన కార్యక్రమం మండలంలో గురువారం నుంచి ప్రారంభమైంది. పోతంగి సచివాలయం పరిధిలోని పింఛన్ లబ్ధిదారులు పింఛన్ తీసుకోవడానికి సుమారు పది కిలోమీటర్ల దూరం నుంచి సచివాలయానికి వచ్చారు. సచివాలయం ఎదురుగానున్న హైవే రోడ్డు పక్కన చెట్టు నీడలో పడి గాపులు కాసి పింఛన్లు తీసుకున్నారు.

అనంతగిరి:సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వాలంటీర్లు పింఛను సొమ్ము పంపిణీ చేయరాదని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీలో ఆలస్యం నెలకొంది. దీంతో పంచాయితీ మారుమూల గ్రామాల నుండి సచివాలయాలకు కాలినడకన చేరి రోజంతా పడిగాపులు కాయవలసిన పరిస్థితి నెలకొంది. మండలంలోని పైనంపాడు పంచాయతీ సచివాలయంలో పైనంపాడు, వేంగడ పంచాయతీల పింఛన్ లబ్ధిదారులు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సచివాలయ కేంద్రానికి చేరుకున్నారు. సకాలంలో పంపిణీ చేయక పోవడంతో ఇబ్బంది పడ్డారు. పంచాయతీ పరిధిలో మూడు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసి పింఛన్ పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అనంతగిరి మండలం పైనంపాడు సచివాలయం వద్ద పింఛనుదారులు

దుంబ్రిగుడ మండలం పోతంగి పింఛనుదారుల పడిగాపులు

గురుకుల పాఠశాల విద్యార్థికి తీవ్ర గాయం

ప్రజాశక్తి -మారేడుమిల్లి

స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న బోదులూరు సుందర్ రెడ్డి అనే విద్యార్థి బుధవారం సాయంత్రం తోటి విద్యార్థులతో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో సుందర్‌రెడ్డి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో పాఠశాల సిబ్బంది హుటా హుటిన మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే గాయం తీవ్రంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి

ప్రభుత్వ భూమి ఇదే..

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

వెబ్‌ల్యాండ్‌లో నమోదుకు ప్రయత్నాలు

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన హక్కులు, చట్టాలను తుంగలోకి తొక్కి కొంతమంది భూ స్వాములు ప్రభుత్వ భూమిని కబ్జాకు పాల్పడుతున్న ఘటన మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి బంగారంపేటలో చోటు చేసుకుంది. బంగారంపేట రెవిన్యూ సర్వే నెంబర్ 13/1-13/2లో సుమారు 5 ఎకరాల భూమి అరకు ప్రధాన రహదారికి అనుకుని ఉంది. గతంలో ఆ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కొంతమంది తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై పలు దినపత్రికలో వరుసగా కథనాలు ప్రచురితం కావడం, సీపీఎం నాయకులు రెవిన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు తిరిగి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది భూస్వాములు కన్ను వేసి ఈ భూమి ఎలాగైనా తమ ఆధీనంలోకి తీసుకోవాలన ఆలోచనతో ఆన్లైన్ వెబ్‌ల్యాండ్‌లో తమ పేర్లు నమోదు చేసుకునేందుకు మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నట్లు సమాచారం. ఈ భూమి చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేసేందుకు పొక్లైన్‌తో పనులు చేపడుతుండగా కొంతమంది స్థానికులు గతంలో అడ్డుకోవడంతో అక్కడ నుండి వెళ్లిపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి భూమిని పరిరక్షించాలని కోరారు.

నివాళి అర్పిస్తున్న టిడిపి నేతలు

సర్వేశ్వరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి- దుంబ్రిగుడ: మండల కేంద్రంలో కీర్తిశేషులు, అరకు మాజీ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు జయంతిని టిడిపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కిడారి ఆశయ సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు కే సుబ్బారావు, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించడానికి తగు చర్యలు

- రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్
- ఓటు హక్కు వినియోగంపై మహిళలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు వంద మంది మహిళలు పాల్గొని ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత తెలియజేసే ముగ్గులతో పాటు జాతీయ పతాకం మూడు రంగుల జెండాతో ఆకర్షించే విధంగా ముగ్గులు వేశారు. వీటిని తిలకించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొన్నవారందరికీ ఏదో ఒక బహుమతి ఇవ్వాలని తహశీల్దారును ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో మహిళలు నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకొనే విధంగా ఈ ముగ్గుల పోటీలు ఉపయోగపడతాయని చెప్పారు. 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఇంకా ఓటు నమోదు చేసుకోకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి, డిప్యూటీ తహశీల్దారు బి.రాజు, ఐటీడీఏ పరిపాలన అధికారి డివిన్వి.రమణ, ఐసిడిఎస్ సిడిపిఓ సంధ్యారాణి, సీనియర్ అసిస్టెంట్లు చెల్లాయమ్మ, ఇందిరా బాయ్, వీఆర్వోలు గణపతి, పి.రవి, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, యం.ఆనంద్, జి.ప్రభాకర్, జి.ఒసేవు, రమాదేవి, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముగ్గులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

శిరీష అభ్యర్థిత్వంపై అనుచితంగా మాట్లాడటం సరికాదు

ప్రజాశక్తి-కూనవరం

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి అభ్యర్థి మిరియాల శిరీషాదేవిపై అనుచితంగా మాట్లాడటం సరికాదని మాజీ ఎంపీ సోడే రామయ్య అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా శిరీషాదేవిని ప్రకటించిన రోజు నుండి నియోజక వర్గంలోని కొంత మంది వంతల రాజేశ్వరి అనుచరులు శిరీష కుటుంబ సభ్యులపై అనుచితంగా అర్థరహితంగా మాట్లాడడం, పార్టీ సోషల్ మీడియా గ్రూప్‌ల్లో వీడియోలు పెట్టడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం, సమావేశాలు పెట్టడం అంటే టిడిపి అధినేత చంద్రబాబు నిర్ణయాన్ని వ్యతిరేకించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇటువంటి పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని పార్టీ క్రమశిక్షణ సంఘం సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో 40 సంవత్సరాల తర్వాత ఎస్‌టి కోయ సామాజిక తరగతికి చెందిన సాధారణ అంగన్వాడీ టీచర్ అయిన మిరియాల శిరీషకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం వంతల రాజేశ్వరికి భజన చేసే వారికి నచ్చడం లేదని పేర్కొన్నారు. వారి వ్యక్తిగత ఆర్థిక, రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం మిరియాల శిరీష కుటుంబ సభ్యులపై తప్పుడు, విష ప్రచారం చేయడం తగదన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు శిరీష వెంటే ఉన్నట్లు చెప్పారు.

'స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా'

ప్రజాశక్తి-సీలేరు : పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు సిపిఐ సీనియర్ నాయకులు సుంకర విష్ణుమూర్తి వెల్లడించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ పాడేరు టికెట్ సిపిఐకి కేటాయిస్తారని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశించారని, కాని పొత్తులో భాగంగా కాంగ్రెస్ పోటీ చేస్తుండడంతో తాము చాలా ఒత్తిడికి గురయ్యామని పేర్కొన్నారు. సిపిఐకి అత్యధిక ఓట్లు ఉన్న పాడేరు నియోజకవర్గం తమకు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, ప్రస్తుతం అల్లూరు జిల్లా కార్యవర్గంలోనూ ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు తనకు సహకరించాలని కోరారు.

కళాజాతా ద్వారా ఓటర్లతో చైతన్యం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఓటర్ల చైతన్యం కల్గించడానికి స్థానిక సచివాలయం వద్ద గురువారం తహసీల్దార్ ఏ. వెంకటరమణ రావు ఆధ్వర్యంలో కళ జాత నిర్వహించారు. కళ జాత ద్వారా ఓటు యొక్క ప్రాముఖ్యత వివరిస్తూ, ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటు లేని వారు ఓటు నమోదు కేంద్రం లో నమోదుచేయించుకోవాలని సూచించారు. 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఏసుబాబు, పంచాయతీ సెక్రెటరీ పరమేశ్వరి, సచివాలయసిబ్బంది, బిఎల్‌ఓలు, కళ జాత బృందం, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు వెంకటరమణారావు

ఎండలో ఆరబెట్టిన విప్ప పూలు

ముమ్మరంగా విప్ప పూలు సేకరణ

ప్రజాశక్తి- విఆర్.పురం

ఏజెన్సీలోని మారు మూల గిరిజన పల్లెలో ఆదివాసీలు విప్ప పూలు సేకరణలో బిజీగా ఉన్నారు. ఇంటిల్లిపాధి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి విప్ప పూలు సేకరించి వాటిని ఇళ్లకు తెచ్చి ఎండలో ఆరబెడుతున్నారు. ఇలా ఆరబెట్టిన విప్ప పూలు ఎండిన తరువాత తమ దగ్గర ఉన్న వారపు సంతల్లోనూ, మార్కెట్‌లోనూ విక్రయిస్తారు. గిరిజనుల సంప్రదాయం ప్రకారం విప్ప పూలును పెళ్లి పేరంటాలకు ఉపయోగిస్తారు. అందువల్లే ప్రతి ఇంటా ఈ కాలంలో విప్ప పూలు దర్శనమిస్తున్నాయి.

శ్రీరామగిరి ఆలయం రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : రెండో భద్రాద్రిగా పేరుగాంచిన మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీరామగిరి శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, దానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు రానున్నారని, అలాగే వారం రోజుల పాటు సంప్రదాయ పద్ధతిలో సేవలు, వివిధ కార్యక్రమాలు జరుగుతాయని, వాటికి కూడా భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. ఇటువంటి సమయంలో ఆలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడం వల్ల భక్తులు ఇబ్బందే పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా రేఖపల్లి నుండి శ్రీరామగిరి వెళ్లే రోడ్డు చాలా వరకు గుంతలు పడి ఉందన్నారు. శ్రీరామనవమి సందర్భంగా వారం రోజుల ముందు నుండే ఈ మార్గంలో అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతాయని, ప్రమాదాలు జరగకుండా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు బాగుల ప్రమీల, కోట్ల రామ్మోహన్ రెడ్డి, చోడె గంగాధర్, పెడపెట్ల పవన్ కళ్యాణ్, బాగుల అంజనరావు, పసుపులేటి నవీన్, ముంజపు శ్రీరామ్, కోట్ల రాజిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

నూనె రమేష్‌కు ఉగాది కవి సమ్మేళనానికి ఆహ్వానం

ప్రజాశక్తి-విఆర్.పురం

ఉగాదిని పురస్కరించుకొని అంతర్జాతీయ సాహితీ సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక కొనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన అమలాపురంలో నిర్వహిస్తున్న ఉగాది జాతీయ శతాదిక కవి సమ్మేళనానికి మన్యం యువ కవి నూనె రమేష్‌కు ఆహ్వానం అందింది. ఈ కవి సమ్మేళనాన్ని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, జాతీయ కన్వీనర్ కొల్లి రామావతి నేతృత్వంలో నిర్వహిస్తున్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

అరకులో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని, వీరి గెలుపుతోనే ఆదివాసీల మనుగడ సాధ్యమని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ప్రభు దాస్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇతర పార్టీలతో అల్లూరి జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, మనుగడ లేకుండా కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. జీవో 3, 1/70 చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఏ ఒక్కనాడు వైసిపి, టిడిపిలు ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. ఓటు వేసే ముందు మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. పదేళ్లుగా బిజెపి, ప్రభుత్వాలతో గిరిజనలకు ఒరిగింది ఏమీ లేదన్నారు.

హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీలో దిగగత్తుం గ్రామంలో సిపిఎం నేతలు ప్రచారం చేవట్టారం. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్‌పిటిసి గంగరాజు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు, చట్టాల రక్షణకై నిత్యం పోరాటం చేసేది సిపిఎం పార్టీ అని గుర్తు చేశారు. చట్టసభల్లో మన గొంతు వినిపించాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఆదివాసీ ఓటును సిపిఎంకి వేసి మద్దతు ఇవ్వాలని ఆయన అన్నారు. ఓటు వేసే ముందు మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. వైసిపి, బిజెపి గిరిజనులకు ఒరిగింది ఏమీ లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట వైస్ వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు, సిపిఎం జిల్లా నాయకులు ఎస్ జి పోతురాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు టి.సూర్యనారాయణ, మండల కార్యదర్శి కాపుల కృష్ణారావు, నాయకులు మూర్తి, ఆనంద్, శివ శంకర్, బుద్రయ్య పాల్గొన్నారు.

అరకులోయ : రానున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఎం నాయకులకు గెలిపిస్తేనే ఆదివాసీ ప్రాంత గిరిజనులకు రక్షణ ఉంటుందని సిపిఎం నాయకుడు పి రామన్న తెలిపారు..అరకులోయ మండలం మాదల పంచాయతీ తుంగాగడ్డ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాంగి రామన్న మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, జీవో 3 పునరుద్ధరణకు సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రాంతంలో గతంలో అక్రమంగా మైనింగ్ తవ్వకాలు చేయాలని ప్రభుత్వాలు అనుమతులు ఇస్తే సిపిఎం ప్రజల పక్షాన నిలబడి మైనింగ్ భూతాన్ని సిపిఎం తరిమి కొట్టిందన్నారు. రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ సదుపాయం కల్పించాలని గ్రామాల్లో సర్వే చేసి ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ప్రజలను పోరాటాల వైపు తీసుకొచ్చి కొన్ని సమస్యలు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.కామేశ్వరరావు, గిరిజన సంఘం నేత బాలకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

అనంతగిరిలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

అనంతగిరి: సిపిఎం అరకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ వేంగడ పంచాయతీ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు కోరారు. మండలంలోని వేంగడ పంచాయతీ మెట్టువలస, గోమంగిపాడులో పర్యటించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో టెంట్, మజ్జిగ, మంచి నీరు సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రామన్న కె.ఎర్రన్న, అప్పన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించండి

వీఆర్.పురం : రాష్ట్రానికి, ముఖ్యంగా పోలవరం నిర్వాసితులకు ద్రోహం చేసిన బిజెపి, దానితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన కూటమిని, బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తూ, రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న వైసిపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని, సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం ఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పులి సత్యనారాయణ, మండల కార్యదర్శి సోమల చిన్నబాబు పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నమట్టపల్లి, కన్నాయిగూడెం గ్రామాల్లో గురువారం ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ సమగ్ర అభివృద్ధి జరగాలంటే లౌకికశక్తులను గెలిపించాలని కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం పాదయాత్ర చేసి రాజకీయ అజెండాగా మార్చిందని చెప్పారు. నిర్వాసితులు ఏ ఇబ్బందుల్లో ఉన్నా ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందన్నారు. ఏజెన్సీలో రోడ్లు, మంచినీరు, కొండపోడు పట్టాలు, ఉపాధి హామీ పనులు వంటి వాటి కోసం సిపిఎం పోరాడిందని గుర్తు చేశారు. సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఆదివాసీల సమస్యలపై గళం విప్పే నాయకులను చట్టసభలకు పంపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య, దూలయ్య, తాతబాబు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో గురువారం జనరల్ బాడీ సమావేశం జరిగింది. మడకం పొద్దయ్య అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ కారణంగా ముంపునకు గురవుతున్న ఈ ప్రాంత ప్రజలు వరదల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితులకు న్యాయం చేయడం లేదని పేర్కొన్నారు. వరదల వల్ల పంటలు వెయ్యాల్సిన సమయంలో వెయ్యక దిగుబడులు తగ్గి రైతులు అప్పుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. ఈ ప్రాంత ప్రజలకు న్యాయం జరగాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, ఎంపిటిసి జయసుధ, న్యాయవాది రవితేజ, ఆవుల మురళి, కర్నాటి శ్రీనివాసరావు, ధన్నూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అంకితభావంతో పనిచేయాలి

జాయింట్ కలెక్టర్ భావనా పశిస్ట్

మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి-పాడేరు: సెక్టార్ అధికారులు అంకితభావంతో ఎన్నికల విధులను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్ స్పష్టం చేసారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ప్రి సైడింగ్ అధికారులకు, పోలింగ్ పార్టీలకు, రిటర్నింగ్ అధికారులకు, జిల్లా ఎన్నికల అధికారికి మధ్య సెక్టార్ అధికారులు వారధిగా విధులు నిర్వహించాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు నియోజక వర్గం సెక్టార్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గురువారం మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సెక్టార్ అధికారులకు పోలింగ్‌కు వారం రోజులు ముందుగా ఎగ్జికూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు వస్తాయని చెప్పారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతీ పోలింగ్ కేంద్రం, రూటులపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. మాక్ పోలింగ్ అదేవిధంగా పోలింగ్ ప్రక్రియ సకాలంలో నిర్వహించే విధంగా పోలింగ్ అధికారులను సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ నుండి పోలింగ్ అధికారులకు స్థానిక ఎపిఆర్ గురుకుల కళాశాలలో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ప్రక్రియపై శిక్షణ అందిస్తామన్నారు. పోలింగ్ అధికారుల శిక్షణకు సెక్టార్ అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని అన్నారు. సెక్టర్ అధికారులకు సరఫరా చేసిన హేండ్ పుస్తకాలను క్షణ్ణంగా చదివి అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చేయవలసిన పనులు, చేయకూడని పనులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మావతి, పాడేరు నియోజక వర్గం సెక్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో చిన్నపిల్లల వార్డు పున: ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జి ఆసుపత్రిలో ఆధునికీకరణ పనులు పూర్తయిన చిన్నపిల్లల ఐసియు వార్డును ఎన్నికల నియమావళి అనుసరించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం పున్నప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.80 లక్షలతో దీనిని నిర్మించారు. ఇందులో సిఎస్ఆర్ నిధులు రూ.40 లక్షలు, కెజిహెచ్ హెచ్‌డిఎస్ రూ.20 లక్షలు, ఎఎంసి నిధులు రూ.20 లక్షలతో చిన్నపిల్లల విభాగంలో ఐసియు, పూర్తి స్థాయి వెంటిలేటర్లు, ఎసి, అధునాతన ఉపకరణాలు సమకూర్చి కార్పొరేట్ ఆసుపత్రి రీతిలో ఆధునికీకరణ పనులు చేపట్టారు. కార్డియాలజీ సిటివిఎస్ విభాగంలో రూ.25 లక్షల నిధులతో గుండె శస్త్రచికిత్స ఐసియు, వార్డుల ఆధునికీకరణ, రూ.15 లక్షలతో గైనిక్, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగ అనుసంధాన వారది (ర్యాంప్) పనులు పూర్తి అయిన సంధర్భంగా ఆయా విభాగాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్, ఎఎంసి ప్రిన్సిపల్, చిన్నపిల్లల వార్డు విభాగాధిపతులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన చిన్న పిల్లల వార్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

'పారిజాతపర్వం' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రేక్షకులకు మంచి వినోదం పంచనున్న క్రైమ్ కామెడీ చిత్రం పారిజాత పర్వం సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 19వ తేదీన విడుదల చేయనున్నట్లు నిర్మాత వనమాలి క్రియేషన్స్ పద్మ తెలిపారు. ఈ చిత్రం ప్రమోషన్ సందర్భంగా గురువారం నగరంలోని సిరిపురం జంక్షన్ వద్ద గల వివాన్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా పారిజాతపర్వం నిర్మించామని, తప్పకుండా ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగుంటామని తెలిపారు. ప్రముఖ నటుడు సునీల్, శ్రద్ధాదాస్, ప్రధాన పాత్రల్లో సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు మంచి వినోదం, ఆహ్లాదం, ఆనందం కలిగిస్తుందని చెప్పారు. ఈ చిత్రంలో చైతన్య రావు మదాది, మాలవిక సతేషన్, వైవా హర్ష, శ్రీకాంత్ అయ్యంగర్ నటించారన్నారు. సినిమా డైరెక్టర్ సంతోష్ మాట్లాడుతూ, ఇది కిడ్నాప్ డ్రామా కథనంతో కూడిన సినిమా అన్నారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ మాట్లాడుతూ, పారిజాత పర్వం టైటిల్ ఆసక్తికరమైనదని, నటనకు ఆస్కారం ఉన్న పాత్ర అని తెలిపారు. హీరో చైతన్యరావు మదాది మాట్లాడుతూ, విశాఖ తనకు ఎంతో ఇష్టమైన నగరమన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ, తమ చిత్ర యూనిట్ తిరుపతి, విశాఖ సహా అన్ని జిల్లాల్లో ప్రమోషన్ చేస్తున్నామన్నారు. విశాఖలో మంచి టాక్ వస్తే సినిమా ఘన విజయం సాధించినట్టే భావిస్తామన్నారు.

ఉన్నతాశయంతో ముందుకు సాగితే విజయం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విద్యార్థులు నిరాశ నిస్పృహలను విడనాడి ఉన్నతాశయంతో ముందుకు సాగితే జీవితంలో విజయం సాధించవచ్చని ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పిలుపునిచ్చారు. గురువారం ఎయు తెలుగు విభాగంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన ఎంఎ చివరి సంవత్సరం స్నాతకోత్తర విద్యార్థుల వీడ్కోలు సభలో నరసింహారావు మాట్లాడుతూ తెలుగు విభాగ ఆచార్యులు సాహిత్య విలువలతో పాటు మానవీయ, నైతిక విలువలతో కూడిన బోధన సాగిస్తూ సమాజాభివృద్ధికి మానవ వనరుల పురోభివృద్ధికి దోహదపడడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థి దశ క్లిష్టతరమైనదని ఈ సమయంలోనే అనేక వ్యసనాలకు ఆకర్షితులై పెడదోవ పట్టే అవకాశం ఉందని, వాటి దరికి చేరకుండా ఉన్నతవిద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, విద్యాసంస్థలకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు జి యోహాన్ బాబు, ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ అయ్యగారి సీతారత్నం, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టెపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు, పరిశోధక, స్నాతకోత్తర విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ప్రతిష్టాత్మకమైన విశాఖపట్నం జిల్లా న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎన్ నరసింహమూర్తి తెలిపిన వివరాలివి. విశాఖ న్యాయవాదుల సంఘంలో మొత్తంగా 2866 మంది అర్హులైన ఓటర్లు ఉండగా, 2139 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 74.6శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం పదిన్నర గంటలకు మందకొడిగా ప్రారంభమైన ఓటింగ్, మధ్యాహ్నం12 గంటల తర్వాత ఊపందుకుని, రెండున్నర గంటల వరకు గుంపులుగుంపులుగా న్యాయవాదులు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి బెవర సత్యనారాయణ, సన్నీ యాదవ్ ప్రధాన పోటీ ఉండగా, ప్రధాన కార్యదర్శి పదవికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ న్యాయవాది నూకల వెంకటేశ్వరరావు, నరేష్ మధ్య ప్రధాన పోటీ ఉంటుందని ఓటింగ్ సరళిని బట్టి అంచనా వేస్తున్నారు. 18 మంది కార్యవర్గ సభ్యుల స్థానాలకు 51 మంది అభ్యర్థులు పోటీకి పడ్డారు. గురువారం రాత్రి 7 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందన్లి సహాయ ఎన్నికల అధికారులు ఎంకే శ్రీనివాస్, బండి ప్రభాకర్ తెలిపారు.

ఇఫ్తార్ విందులో కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ముస్లిముల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని వైసిపి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె కె రాజు అన్నారు. గురువారం జివిఎంసి 48వ వార్డు, బర్మా కాలనీ ముస్లిం వీధిలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిముల ఉపవాస దీక్షను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు తనను ఆహ్వానించడం సంతోషం కలిగించిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైసిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కొండవాలు ప్రాంతంలోని ముస్లిముల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో 48వ వార్డు ఇన్‌ఛార్జి నీలి రవి, కార్పొరేటర్ బర్కత్ ఆలీ, ఐహెచ్ ఫరూఖీ, కెవి బాబా, వసంతల అప్పారావు, కర్రి రామిరెడ్డి, షేక్ బాబ్జి, భూలోక్ శ్రీను, చిన్న, కృష్ణ, హేమంత్, రాజన్న గంగరాజు, డోప్ప శ్రీను, కాలనీ అధ్యక్షులు షేక్ మదీనావలి, ఉపాధ్యక్షులు బషీర్ ఆలం, కార్యదర్శి షేక్ గౌస్, నాయకులు లంక భాస్కర్,ఎం.సునీల్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు సామాజిక పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పింఛన్ల అందక తీవ్ర ఇక్కట్లకు గురైన పింఛన్ లబ్ధిదారులకు ఎట్టకేలకు అధికారులు గురువారం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని గురువారం సాయంత్రానికి 40 శాతం వరకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని పలు సచివాలయాల వద్ద జరుగుతున్న పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో లోకల యాదగిరిశ్వరరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ శుక్రవారం నాటికి మండలంలోని లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ పూర్తవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : చింతూరు గ్రామపంచాయతీ పరిధిలో గురువారం 530 మంది పింఛన్‌దారులకు రూ.16.18లక్షలు అందజేశారు. మొత్తం 24.70 లక్షలు పింఛన్లు డబ్బులు రావడం జరిగింది. నడవలేని, అంగవైకల్యం కలిగిన, ముసలివారికి ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసినట్లు చింతూరు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మిగిలిన పింఛన్‌దారులకు శుక్రవారం అందజేస్తామని చెప్పారు. పింఛన్ కోసం వికలాంగులు మండుటెండలో సచివాలయాల ముందు పడిగాపులు కాశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అన్నపూర్ణ, సారక్క, ఏఎన్ఎం చిన్న లక్ష్మి, మహిళా పోలీస్ పి.మంగతాయారు, డిజిటల్ అసిస్టెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలోని ఓ సచివాలయంలో పింఛన్ల పంపిణీ

చింతూరు, విఆర్.పురలో పింఛన్ల కోసం అవస్థలు పడుతూ వస్తున్న లబ్ధిదారులు

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఎట్టకేలకు గురువారం నుంచి పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లొవకుమారి ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్, వరకు ఎన్నికల అధికారి ఆదేశాలు మేరకు సచివాలయ సిబ్బంది పింఛన్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలో 319 మంది ఉండగా పింఛనుదారులు ఉండగా, వారికి రూ.9,75,500 ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

వృద్ధులు, వికలాంగుల ఇక్కట్లు

విఆర్.పురం : పింఛన్లు కోసం మండలంలోని వృద్ధులు, వికలాంగులు అనేక వ్యవస్థలు పడ్డారు. గురువారం నుండి మండలంలో అన్ని రకాల పింఛన్లు ఆయా సచివాలయాలలో ఇవ్వడంతో పరిసర గ్రామాల నుండి వృద్ధులు, వికలాంగులు కార్యాలయాలకు చేసుకోలేక పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండలు వేడితో వృద్ధులు విలవిలాడారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

జాతీయ యువజనోత్సవాలలో ఎయుకు పతకాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : పంజాబ్ రాష్ట్రం లూధియానా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 37వ జాతీయ యువజనోత్సవాలు ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. జాతీయ స్థాయిలో రెండు విభాగాలలో పతకాలను సాధించారు. ఎయు చిత్రకళా విభాగ విద్యార్థి కె.నాగ మణికంఠ క్లే మోడలింగ్‌లో మూడవ స్థానాన్ని సాధించాడు. అదే విధంగా ఇనస్టలేషన్ పోటీలో ఎయు విద్యార్థులు జె.రంగబాబు, యుఎంఎస్ నవ్య, బి.ఝాన్సీ, కె.రేణుక బృందం రెండవ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా వీరిని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో ఎయు ప్రతిభను ఇనుమడింపచేసిన విభాగ విద్యార్థులను అభినందించారు. గతంలో ఏయూలో నిర్వహించిన సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని విజేతలుగా నిలచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సుదీర్ఘ కాలం తరువాత ఏయూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయమోహన్ విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విసి

డాక్టర్ శ్రీకృష్ణకు యోగ చికిత్స ఆచార్య పురస్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా విభాగం గౌరవాచార్యులు డాక్టర్ చందన శ్రీకృష్ణకు యోగ చికిత్స ఆచార్య పురస్కారం లభించింది. ఇండియన్ యోగా అసోసియేషన్ డాక్టర్ శ్రీకృష్ణ సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకృష్ణను ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. యోగాతో రోగాలను మాన్పే దిశగా డాక్టర్ శ్రీ కృష్ణ పనిచేస్తున్నారు. కార్యక్రమంలో ఏయూ యోగా కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భాను కుమార్ పాల్గొన్నారు.

గెస్ట్‌హౌస్‌ల లీజు ప్రతిపాదన వద్దు

- యాజమాన్యం ప్రయత్నాలను ఖండించిన స్టీల్ సిఐటియు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న గంగవరం గెస్ట్‌హౌస్, ఉక్కునగరంలోనిఉక్కు హౌస్‌లను 30ఏళ్లపాటు ప్రైవేట్ కాంట్రాక్టర్లకు లీజుకు ఇచ్చేందుకు యాజమాన్యం ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని స్టీల్ సిఐటియు అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్,యు రామస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గెస్ట్ హౌస్‌లు ప్రైవేటుకు లీజుకిస్తేకార్మికులకు అన్యాయం జరుగుతుందని, ఉక్కునగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. స్టీల్‌ప్లాంట్ కార్మికులు శుభకార్యాలకు వినియోగించుకునే గెస్ట్‌హౌస్‌ను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెడితే ఉద్యోగులు, కార్మికుల అవసరాలకు అందుబాటులో ఉండకపోగా, అధికఛార్జీలు చెల్లించే పరిస్థితి ఉత్పన్నమౌతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ నియంత్రణలో ఉన్నప్పటికే అపుడపుడూ మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, అదే ప్రయివేటుకు కట్టబెడితే విచ్చలవిడితనం మరింత పెరిగిపోతుందన్నారు. దేశభద్రత దృష్ట్యా గంగవరం గెస్ట్‌హౌస్ ఎంతో కీలకమైందని, అటువంటిచోట ప్రయివేటు వ్యక్తుల పెత్తనం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని, ఇటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

7న జూలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : నేషనల్ జూ లవర్స్ డే సందర్భంగా ఈనెల 7న ఆదివారం, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు జూక్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. 7న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ఈ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. 3 నుంచి 12 ఏళ్ళ లోపు చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జూలో ఉన్న జంతువుల థీమ్‌లో ఉన్న డ్రెస్‌లు చిన్నారులు ధరించి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. వాళ్ల వేషం వేసిన జంతువుకు సంబంధించి ఏదైనా కొంత సమాచారం చెప్పడం, లేదా వాటి వలే శబ్దం చేస్తూ వాటిని అనుకరణ చేయవచ్చున్నారు. చిన్నారులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించడంతో పాటు వాటి సంరక్షణ గురించి తెలియజేయడం కోసం ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చిన్నారులను తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ప్రోత్సహించాలని క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

ఉక్కు కార్మికుల వేతనాలు చెల్లించాలి

స్టీల్ సిఎండికి లేఖరాసిన 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికులకు, ఆఫీసర్లకు, కాంట్రాక్ట్ కార్మికులకు ఎలాంటి వివక్షత లేకుండా వేతనాలు చెల్లించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు కోరారు. ఈ మేరకు స్టీల్ ప్లాంట్ సిఎండి అతుల్ బట్‌కు లేఖ రాశారు. స్టీల్ ప్లాంట్‌లో గత నెల రూ. 2500 కోట్లకుపైగా స్టీల్ అమ్మకాలు జరిగాయని, ఫోర్జుడ్ వీల్ ప్లాంట్ రైల్వేకు అమ్మకం ద్వారా రూ.1100 కోట్లు, హెచ్ బి కాలనీ స్థలాల ద్వారా రూ.243 కోట్లు నిధులు రానున్నాయని, జిందాల్ నుండి రూ.1200 కోట్లు, టాటా స్టీల్ ద్వారా రూ.800 కోట్లు నిధులు కంపెనీకి వచ్చినట్లు తెలుస్తోందన్నారు. కానీ ఉద్యోగులకు మాత్రం మార్చి నెల వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నష్టాల పేరు చెప్పి వేతన ఒప్పందం అమలు నిరాకరించడం చట్టవిరుద్ధమన్నారు.ఉక్కు కార్మికులు, అధికారుల తీవ్ర అగ్రహానికి కారణమయ్యే ఇటువంటి చర్యలను తక్షణం ఉపసంహరించుకోకపోతే తీవ్ర ప్రతిఘటన, ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉక్కు ఫైనాన్స్ డైరెక్టర్‌ను కలిసిన త్రిఫ్ట్ సభ్యులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ విభాగానికి నూతన డైరెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన చలువది శ్రీరామ వెంకట గోపాలకృష్ణ గణేష్‌ను గురువారం స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ పాలకవర్గం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. త్రిఫ్ట్ సొసైటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఫైనాన్స్ డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి డి శ్రీరామచంద్రమూర్తి, కోశాధికారి డివిఎస్ఎస్ కొండరాజు, డైరెక్టర్లు కె.శ్రీనివాస్ ఎంవి.రమణ సీనియర్ మేనేజర్ దామోదరరెడ్డి పాల్గొన్నారు.